క్లుప్తంగా

రైల్వే సూపర్‌వైజర్‌కు సన్మానం


నాదమునిని సత్కరిస్తున్న సహ ఉద్యోగులు

నగరి: సదరన్ రైల్వేలో కమర్షియల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఈ నెల చివర ఉద్యోగ విరమణ చేయనున్న పి.నాదమునిని సహ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బుధవారం నగరి మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ ఆవరణలో సన్మాన సభను ఏర్పాటుచేశారు. 41 సంవత్సరాల పాటు విధి నిర్వహణలో మంచిపేరు తెచ్చుకున్నారని వక్తలు ప్రశంసించారు. ఉద్యోగులు పి.కుమారస్వామి, గంగాధరన్, మురుగన్, కుమరేశన్, వినాయగం, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోలు నింపితే చర్యలు


పెట్రోలు బంక్ యాజమాన్యాలకు నోటీసులు అందిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకు పెట్రోలు బంక్ యాజమాన్యాలు వాటర్ బాటిళ్లలో పెట్రోలు నింపకూడదని తహసీల్దార్ అల్‌ఫ్రెడ్ ఆదేశించారు. మండలంలోని పెట్రోలు బంక్, టపాకాయల దుకాణాలను తనిఖీ చేశారు. ఎన్నికలు ఫలితాలు వెలువడేంతవరకు వాహనచోదకులకు, ప్రజలకు వాటర్ బాటిళ్లలో పెట్రోలు పట్టవద్దని పెట్రోల్ బంక్‌ల యాజమానులకు తహసీల్దార్ అల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ మోహన్‌మురళి నోటీసులిచ్చారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే పెట్రోలు బంక్, టపాకాయల దుకాణాలను సీజ్ చేసి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌ఐ ప్రభాకర్, వీఆర్వో చంద్రబాబు, పంచాయితీ కార్యదర్శి కోదండరెడ్డి తదితరులు ఉన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం


పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : పిల్లల్లో రక్తహీనత నివారణకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. గర్భిణులు నెల సరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని తెలిపారు.

తెలుగు భాషపై పట్టు ఉండాలి


మాట్లాడుతున్న మునిలక్ష్మి

కార్వేటినగరం: విద్యార్థులకు తెలుగు భాషపై పట్టు ఉండాలని ఉపాధ్యాయరాలు మునిలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ మండపంలో సుదర్శన హోమం చేస్తామన్నారు.

చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం

తిరుపతి కల్చరల్: జీవన్ జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డులోని డీ -మార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు హాజరై చేనేత, హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వస్త్ర, కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులను ఆదరిస్తున్న జీవన జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు అభినందనీయులన్నారు.

ముడిపల్లె చలపరమ్మ ఊరేగింపు


ముడిపల్లెలో ఊరేగింపుగా వస్తున్న గంగమ్మ


నెత్తం కండ్రిగలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ


కరకంతాపురంలో ఊరేగింపుగా వస్తున్న గంగమ్మ


దండాలు.. దండాలు గంగమ్మతల్లి


గంగమ్మ, పొన్నెమ్మను దర్శించుకుంటున్న మంత్రి ఆర్కే రోజా


అమ్మవారి అభిషేకానికి పవిత్ర జలం తెస్తున్న భక్తులు


కరకంతాపురంలో వేపాకు సారె సమర్పణకు క్యూలో వేచివున్న భక్తులు

- పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో గంగజాతర
- కీళపట్టు గంగమ్మను దర్శించుకున్న మంత్రి ఆర్కే రోజా
- సారెలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు, నెత్తం కండ్రిగ ప్రాంతాల్లో, రూరల్ మండలంలోని ముడిపల్లె, వీకేఆర్‌పురం, గుడికండ్రిగ, మిట్టపాళెం, మూలనత్తం, ఎం.కొత్తూరు గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. తిరుపతి జాతరతో పాటు ఈ ప్రాంతాల్లో జాతరను జరుపుకుంటారు. కీళపట్టులో మంగళవారం రాత్రి పొన్నెమ్మ, గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. నెత్తం కండ్రిగలో గంగమ్మను ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా తీసుకురాగా అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ముడిపల్లె గ్రామంలో తొలుత చలపలమ్మను ప్రత్యేక అలంకరణలో గ్రామ ప్రదక్షిణ చేసి ఆలయానికి చేర్చారు. అనంతరం చలపరమ్మ మాలను తీసుకెళ్లి గంగమ్మకు అలంకరించి భక్తజన సందోహం మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి ఊరి మధ్యలోని వేపాకు గుడిసెకు చేర్చారు.

కరకంతాపురంలో..

కరకంతాపురంలో జాతరను పురస్కరించుకుని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ సమీపం నుంచి భక్తులు అభిషేక జలాన్ని ఊరేగింపుగా తీసుకురావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆ జలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. గ్రామాల్లో గంగమ్మ ఊరేగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వీధినాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగ ప్రదక్షిణం చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. బలిఅన్నం సమర్పించి రాత్రి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

గంగమ్మ, పొన్నెమ్మ సేవలో మంత్రి ఆర్కే రోజా

కీళపట్టు గంగమ్మ జాతరలో మంత్రి ఆర్కేరోజా పాల్గొని గంగమ్మ, పొన్నెమ్మ దేవతలను దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికి మర్యాదలు చేశారు. గంగమ్మ బండారం, ప్రసాదాలు అందజేశారు. గంగమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. గంగమ్మ దేవత ఆశీస్సులతో జగనన్న ముఖ్యమంత్రి కావడం, తాను హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జాతర నిర్వాహకులు చంద్రారెడ్డి, నాయకులు బీడీ భాస్కర్, భాస్కర్ రెడ్డి, యాకోబు, బుజ్జిరెడ్డి, శశికుమార్, బాలప్రసాద్, చిన్నదొరై, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

మహాలక్ష్మి ఆలయంలో..

నిండ్ర: మండలంలోని కేఆర్‌పాళెంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తిరుపతి జాతరను పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాలాభిషేకం, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ఉగ్రాణంపల్లె జాతర

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని ఉగ్రాణంపల్లెలో ముత్య గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. స్థానిక సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువత మాజీ అధ్యక్షుడు ఐరాల మురళీకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున ముత్య గంగమ్మ దేవస్థానం వద్ద గంగమ్మ ప్రతిమను కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీగా ప్రత్యేకంగా తయారు చేసిన గజ మాలను సర్పంచ్ మురళీకుమార్ రెడ్డి అమ్మవారికి సమర్పించారు. పరిసర గ్రామస్తులు అమ్మ వారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పిండి దీపాలు వెలిగించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు(ఎన్ఆర్ఐ) మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామసాని విజయ కుమార్‌రెడ్డి, ఎంపీపీ హేమలత రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి కుంభ కూడు పెట్టి, గండర దీవులతో హారతులు పట్టారు. రాత్రి కోలాహలంగా విశేష కర్పూర హారతులు పట్టారు. బాణ సంచా పేలుళ్ల నడుమ రాత్రి నిమజ్జనం జరిగింది. ఆలయ ధర్మకర్త గుణశేఖర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, ఐరాల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రమణారెడ్డి, కోటీశ్వర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రవి, జగపతి, ఆలయ అర్చకులు శేఖర్‌రెడ్డి, పరందామరెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలత్తూరు జాతర

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆలత్తూరులో నడివీధి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ అంగరంగ వైభవంగా గ్రామ వీధులో ఊరేగించారు. భక్తులు ఇంటింటి వద్ద కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం మహిళలు అధిక సంఖ్యలో వెయ్యికళ్ల దుత్తలను మోసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగిస్తూ జలధికి తరలించారు.


కార్వేటినగరం : నడివీధి గంగమ్మ ఊరేగింపు


ఉగ్రాణంపల్లె: గజమాల ఊరేగింపులో సర్పంచ్ మురళీ కుమార్‌రెడ్డి


ఉగ్రాణంపల్లెలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గర్భిణులకు నిర్విరామంగా పౌష్టికాహారం



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు, నగరిలో..

పుత్తూరు/నగరి: నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణి చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మంత్రి ఆర్కే రోజా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యధావిధిగా విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగన్నం, చిక్కీ, అరటిపండును అందించారు.

కమనీయం లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తరువాత లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో అభిషేకాలు చేసి, స్వామివారికి విశేషాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు, పుష్పయాగం చేశారు. ఆ తరువాత స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి దంపతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.


విశేషాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

అలరించిన అర్జున తపస్సు

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లెలో శ్రీ ద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేకువ జామున ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ద్రౌపదీదేవీ, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో త పస్సుమాను కార్యక్రమం ప్రారంభమైంది. అర్జున వేషధారి పరమశివుని వరం కోరుతూ పద్యాలతో కీర్తిస్తూ తపస్సుమాను అధిరోహించారు. అక్కడి నుంచి వెంట తీసుకెళ్లిన వీబూది, నిమ్మపళ్లను కిందికి విసిరారు. వీటిని అందుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ క్రమంలో సంతాన వరం కోసం పలువురు మహిళలు తడి బట్టలతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. అర్జున తపస్సుమానుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఆలయ ధర్మకర్తలు ధనగిరిరెడ్డి, బాబురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

రాయంచపై జ్ఞాన ప్రదాయినిగా కటాక్షం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్వేత వస్త్రాలను ధరించి.. వేదాలను చేతబట్టి సరస్వతీదేవిగా హంస వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శేష వాహనంపై గో సంరక్షణధారిగా భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 4.30 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కార్యక్రమాలు, హోమ పూజలను పూర్తి చేశారు. 7.30 గంటలకు పిల్లనగ్రోవితో వేణుగోపాలునిగా సుగంధ భరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో స్వామి వారి ఉత్సవమూర్తిని అలంకరించి చిన్న శేషవాహనంపై అధిష్టింపజేశారు. తదుపరి మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న వెంకన్నకు ఉభయ దేవరులతో ఆగమోక్తంగా స్నపన తిరుమంజనంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం జ్ఞాన సరస్వతీదేవిగా ఊయలలో కొలువుదీర్చి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు సరస్వతీదేవిగా హంస వాహనంపై కొలువుదీరిన కల్యాణ వెంకన్నకు విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం ఉదయం సింహవాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆకట్టుకున్న డ్రమ్ము వాయిద్యాలు

వాహనసేవ ఊరేగింపులో సంప్రదాయ గ్రామీణ డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రాజమండ్రి, కొవ్వూరు, జగ్గంపేట, కనుమిట్టలకు చెందిన 80 మంది సభ్యుల బృందం వాయిద్యాలను లయబద్ధంగా వాయించడం భక్తులను అలరించింది. అలాగే చిన్నపిల్లలు నృత్యం చేస్తూ , కోలాటాలు ఆడుతూ వాహనసేవల ముందు సాగారు.


శేష వాహనంపై వేణుగోపాలునిగా...


హంస వాహనంపై జ్ఞాన ప్రదాతగా..


వాహనసేవలో డ్రమ్ము వాయిద్యాల సందడి

చంద్రప్రభపై గోవిందుడి అభయం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో శ్రీగోవిందరాజస్వామి అభయమిచ్చారు. కళాబృందాల ప్రదర్శనల మధ్య, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి సూర్యప్రభ వాహన సేవ అత్యంత వేడుకంగా నిర్వహించారు. భక్తజన బృందాలు చెక్కల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనధారుడై గోవిందుడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీభూవి సమేత శ్రీగోవింద రాజస్వామి వారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, చందనంతో అభిషేకం చేశారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు.

నేడు శ్రీగోవిందరాజస్వామి రథోత్సవం

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.35 గంటల నుంచి రథంపై అధిరోహించిన స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.